# వారసులెవరు?

'చీర్స్!!'

ఆ రూంలో సుబ్బారావుతోపాటు అతని స్నేహితులు మొత్తం అయిదుగురు కలిసి బీర్లు తాగుతున్నారు. అయిదుగురూ డిగ్రీ ఫైనల్  ఇయర్ స్టూడెంట్స్... అయిదుగురిలో సుబ్బారావులా గ్రామం నుంచి పట్టణం వచ్చి చదువుకుంటున్నవాళ్ళు ఇద్దరున్నారు. మిగిలిన ఇద్దరూ అదే పట్టణానికి చెందిన వారు.

'అరేయ్ సుబ్బారావు ఏది ఒక సిగరెట్ ఇవ్వరా...' అడిగాడు మిత్రుడు వెంకట్ ఆనందంగా.

'నీకెన్నిసార్లు చెప్పాల్రా... నన్ను సుబ్బారావు అని పిలవద్దని మా బాబుకు బుద్ధిలేకుండా వాళ్ళ బాబు పేరు పెట్టాడు. నాపేరు సుబ్బారావు కాదు' అన్నాడు సీరియస్‌గా వెంకట్‌కు సిగరెట్ అందిస్తూ.

'మరేంటమ్మా?' అన్నాడు వెంకట్ సిగరెట్ అందుకుంటూ.

'సుబ్‌రోవ్... ఎస్. యు.బి.బి.ఎ.ఆర్. డబ్ల్యు. సుబ్‌రావ్' అన్నాడు.

'ఏడ్చావ్... నువ్వేమైనా ప్రెసిడెంట్ ఆఫ్ అమెరికా అనుకుంటున్నావా? సుబ్‌రోవ్... అట సుబ్‌రోవ్' అన్నాడు మరో మిత్రుడు కోటేశ్వరరావు సీరియస్‌గా బీరు తాగుతూ.

'అవున్రా నేను ప్రెసిడెంట్ ఆఫ్ అమెరికా కాకపోయినా అమెరికా వెళ్ళి అక్కడ సెటిల్ కావాల్సిన వాడ్ని కనుక నా పేరును ఆ విధంగా మార్చుకున్నాను' అన్నాడు బీరు బాటిల్ ఎత్తి తాగుతూ.

'ఏంట్రా డిగ్రీ చదవడానికే మీనాన్న చేత ఉన్న మూడు ఎకరాల పొలం అమ్మించావు. ఇక అమెరికా ఎలా వెళ్తావ్ నాయనా?' అన్నాడు వెంకట్.

'అదేరా నా దౌర్భాగ్యం... నాలాంటి మేధావి అసలు ఈ డర్టీ కంట్రీలో వుండాల్సినవాడు కాదు. చూస్తుండు ఎలాగైనా సరే అమెరికా వెళ్ళి తీరతాను. అక్కడ జస్ట్ ఫైవ్ ఇయర్స్ ఉండి కోట్లు గడించి మెర్సిడస్ బెంజ్ కార్లో తిరుగుతాను' అన్నాడు సిగరెట్ వెలిగించుకుంటూ.

'మే గాడ్ బ్లెస్‌యు... అమెరికా సంగతి ఏమోగానీ, మంచి బీరు పార్టీ ఇచ్చావురా... మొత్తానికి మూడు ఎకరాలు అమ్మించావు... ఏదైతేనేం... బీరు భలే కిక్కు ఇస్తోం...దిరా... రియల్లీ ఇట్స్ ఏ గ్రేట్ పార్టీ... థాంక్స్' అన్నాడు వెంకట్.

'నోర్మూయ్‌రా... ఏంటి కొత్తగా మాట్లాడుతున్నావు... నేను ఇంటికెళ్ళి డబ్బులు తెచ్చిన ప్రతిసారీ మీకు పార్టీ ఇస్తూనే ఉన్నాను కదా!... ఇదేమైనా కొత్తా మనకు? మన మధ్య థాంక్సేంటీ నాన్సెన్స్... నోర్మూ...సుకుని. తాగు. మరో రౌండ్ వేసు...కుం...దామా... చెప్పు... తెప్పిస్తాను...'అంటూ పర్స్ తీసి అయిదు వందల నోటు బయటకు తీసి...

'అరేయ్... కోటేశ్వరరావ్... నువ్వు... వెంకట్‌గాడు స్కూటర్‌మీద వెళ్ళి మరో అయిదు... బీర్లు... చికెన్ బిర్యాని ప్యాక్ చేసుకురండి. సిగరెట్లు మర్చిపోకండి...' అని నోటు వాళ్ళకిచ్చాడు.

'వారెవ్వా... మావా... ఫ్రెండువంటే నువ్వేరా... నువ్వు తప్పకుండా అమెరికా వెళ్తా...వు. అప్పు... డు స్కాచ్ కొడ...దాం... మావా... పదినిమిషాలాగు... వచ్చేస్తాం' అంటూ ఇద్దరూ బయటకు వెళ్ళారు.

'ఎందుకురా డబ్బులు అలా తగలేస్తావ్?... అవి పొలం అమ్మి మీ నాన్న ఇచ్చిన డబ్బులు... ఏదో కంప్యూటర్ కోర్స్ వెలగబెట్టి పైకొస్తావని ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న మీవాళ్ళ కలల్ని వమ్ము చేయకురా...' అన్నాడు సందీప్.

'నోర్మూయ్ రా... ఈడియట్ నువ్వు తాగవు. ఎదుటివాళ్ళని తాగనివ్వవు. కంప్యూటర్ కోర్స్‌కు వెధవ పదివేలు ... సరిపోతాయనుకుంటున్నావా? యాభైవేలు కావాలి. అవి ఎటూ వాళ్ళూ ఇవ్వ...లేరు. అందుకే... వున్నన్నాళ్ళు ఎంజాయ్ చేద్దామని... తెచ్చుకున్నాను. అయినా... ఈ ఏడాదితో డిగ్రీ అయిపోతుందిగా... ఏదో ఒక ఉద్యోగం దొరక్కపోతుందా... అప్పుడు... ఈ పదివేలు ఏంటి ఖర్మ... లక్షలు సం... పాదిస్తారా. ఫూల్... జాబ్ రాకపోతే... బిజినెస్... చే...స్తాను...' అన్నాడు సుబ్బారావు మత్తుగా.

'నీ ఇష్టం రా... నేను వెళ్తున్నాను... కంప్యూటర్ క్లాసుకు టైం అయింది.' అన్నాడు సందీప్.

'గెట్‌లాస్ట్... నీతులు చెప్పే వాళ్ళంటే చిరాకు నాకు... చూస్తూండు. ఒక ఇయర్లో... టూ లేక్స్ సంపాది...స్తాను' అంటూ సిగరెట్ వెలిగించుకున్నాడు సుబ్బారావు.

'థాంక్స్...' అంటూ వెళ్ళిపోయాడు సందీప్.

'వాడి మాటలు పట్టించుకోకురా... వాడుత్త సెంటిమెంటల్ ఫెలో... నీకేంరా జీనియస్‌వి... నీకు బ్రైట్ ఫ్యూచర్ ఉంది. బైదిబై... నాకో ఫైహండ్రెడ్ రూపీస్ కావాలి... నీకు మళ్ళీ నెక్స్ట్ వీక్ ఇచ్చేస్తాను. .. మా ఇంటి దగ్గర నుంచి ఎమ్.ఓ ... రాగానే ఇస్తాన్రా...' అన్నాడు ఆనంద్.

'ఓ.కే. ఓ.కే... దానికింతగా అడగాలట్రా ఫూల్ ఇదిగో తీసుకో...' అన్నాడు సుబ్బారావ్ సిగరెట్ వెలిగించుకుని.

'థ్యాంక్యూ...రా... థ్యాంక్యూ వెరీమచ్. నేను వెళ్ళొస్తాన్రా... నాకోసం పాపం... రాణి వెయిట్ చేస్తుంటుంది... హాస్టల్ దగ్గర... మళ్ళీ రేపు కలుస్తాను' అన్నాడు ఆనంద్ ఆనందంగా.

'ఓ.కే... ఎంజాయ్ వెళ్ళిరా...' అన్నాడు సుబ్బారావ్ కన్నుగీటుతూ. ఆనంద్ నవ్వుకుంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు.

సుబ్బారావ్ బెడ్‌మీద నుంచి లేచి సిగరెట్ కాల్చుకుంటూ బాత్‌రూంలోకి వెళ్ళాడు.

* * *

'పొలం అంతా తమ్ముడు చదువుకోసమని అమ్మి ఇచ్చేశావు.. ఇప్పుడు మన బతుకుల సంగతేంటి బావా? మనం ఎట్టా బతకాలి? మామయ్య కూడా ఎనకా ముందు ఆలోచించకుండా పొలం అమ్మి డబ్బులు మొత్తం చిన్న కొడుక్కే ఇచ్చేశావు. పిల్లలు కలవాళ్ళం. రేపటినుంచి మనం ఎలా బతకాలో నాకు అర్థం కావటంలేదు...' అంది శివయ్య భార్య లక్ష్మి.

'ఎందుకే అట్టా బాధపడతావ్...? రేపు తమ్ముడు చదువు పూర్తి చేసుకుని పెద్ద ఉద్యోగం చేస్తుంటే ఆ గౌరవం ఎవరికే... మనకి కాదూ... నాకేంటే... ఎవరి పొలంనయినా కౌలుకు తీసుకోని సేత్తాను. మట్టిని నమ్ముకున్నోళ్ళం ఆ భూదేవి మనకు అన్యాయం చేత్తదా సెప్పు? నువ్వు దిగులు పడకు... అన్నట్టు నువ్వేదో సెక్క బొమ్మలు తయారు సేత్తున్నావటగా...? ఏందే ఆ బొమ్మలు ఎవరు కొంటారు?' అన్నాడు శివయ్య.

'మన కులవృత్తి మనం సేసుకుంటే తప్పా? మా అయ్య ఇప్పటికీ ఆ బొమ్మలేగా సేసేది... నేను అదే సేత్తున్నా ఇంట్లో ఊరికే కూకోని ఏం సెయ్యమంటావ్?' అంది శివయ్య కంచంలో మరికాస్త అన్నం వడ్డిస్తూ.

'ఇప్పుడు నేనేమన్నానే... సెయ్యొద్దన్నానా? సెయ్యి. మంచిదేగా వేన్నీళ్ళకు సన్నీళ్ళు తోడు. మనూళ్ళో ఇంకా ఎవరైనా సేత్తున్నారా?' అన్నాడు శివయ్య అన్నం కలుపుకుంటూ.

'నీకు ఊళ్ళో విషయాలు ఏం తెలియవు బావా... ఊళ్ళో నాతో పాటే మరో పాతికమంది వరకు సేత్తున్నారు... నెలకోసారి అందరి దగ్గరకు వచ్చి పట్నం నుంచి వచ్చి గవర్నమెంటోళ్ళే బొమ్మలు కొనుక్కెళ్తారంట...' అంది లక్ష్మి ఆనందంగా.

'మంచిదేగా... నేను పొలం పని సేత్తూ సంపాదిస్తుంటే నువ్వేమో ఇంట్లో కూకోనే సంపాదిత్తున్నావు... నాకంటే గొప్పదానివే...' అన్నాడు శివయ్య భార్యను మురిపెంగా చూసుకుంటూ.

'ఏదో వొకటి సెయ్యకపోతే ఎట్టా బావా... పిల్లలు ఎదిగొత్తున్నారు. ఆళ్ళకోసం కట్టపడాలి కదా!...' అంది లక్ష్మి అందంగా సిగ్గుపడుతూ.

'మరింకెందుకే దిగులు. పోతే పోయిందిలే పొలం... తమ్ముడు కట్టపడలేడు. ఆడికి పట్నవాసం అలవాటయిపోయింది...' రేపాడు కలెట్టరయితే మనకేగా పేరు...' అన్నాడు శివయ్య గర్వంగా.

'అబ్బో... తమ్ముడిమీద ఎంత పేమో... మాటపడనియ్యడు... నేనుమాత్రం ఏమన్నాను... కొత్త ఎనకాముందు ఆలోసించి అమ్మాల్సింది అన్నా అంతేగా... అయినా నాకెందుకులే మీ పొలం మీ ఇట్టం...' అంది లక్ష్మి మూతి తిప్పుతూ.

'అట్టా అన్నావు బావుంది. ఆమాట మీదే ఉండు... సూత్తూ ఉండు తమ్ముడు పెద్ద కలెట్టరయ్యే వొత్తాడు మనూరికి...' అన్నాడు శివయ్య కంచంలో చేయి కడుక్కుంటూ.

'అదేంటి బావా అప్పుడే సెయ్యి కడిగేసుకున్నావు... తమ్ముడి ముచ్చటతో కడుపు నిండిపోయిందా?' అంది లక్ష్మి ఆశ్చర్యంగా.

శివయ్య నవ్వుకుంటూ లక్ష్మి పైట చెంగుకి చేయి తుడుచుకున్నాడు.

'నువ్వుత్తి ఎర్రిబాగులోడివి బావా ఎట్టా బతుకుతావో ఏందో...' అంది లక్ష్మి కంచం తీస్తూ.

'నువ్వున్నావు గదే నన్ను బతికించటానికి నాకేంటి భయం?' అన్నాడు జేబులోంచి బీడీ కట్ట తీస్తూ.

'సాల్లే సంబడం...' అని మూతి తిప్పుకుంటూ లోపలికెళ్ళింది లక్ష్మి. శివయ్య నిశ్శబ్దంగా నవ్వుకున్నాడు.

*   *   *

కొండయ్య చేతిలో ముల్లుకర్రతో నెత్తిన చద్దిమూట పెట్టుకుని పొలంకు బయలుదేరాడు. ఇంతలో ఇంటి ముందు నుంచి కోటేశ్వరరావు వెళ్ళటం చూశాడు కొండయ్య.

'ఈడేంది పట్నంనుంచి అప్పుడే వచ్చేశాడు. మరి సుబ్బారావు రాలేదే...' అని మనసులో అనుకుని...

'అరేయ్ కోటీశు... ఏందిరా పట్నం నుంచి ఎప్పుడొచ్చావ్... మా సుబ్బిగాడేడి? బాగా సదువుకుంటున్నారా? పరిచ్చలు బాగా రాశారా?' అని కేకేశాడు కొండయ్య.

కొండయ్యను చూసి కోటేశ్వరరావు మనసు గతుక్కుమంది... భయంగా అతన్ని చూస్తూ ఆగిపోయాడు.

'ఏందిరా అట్టా సూత్తావూ మిడిగుడ్లేసుకుని... రారా లోపలికి.. మావోడు బాగా సదువుతున్నాడా?' మళ్ళీ అడిగాడు కొండయ్య. కోటేశ్వరరావు ఇబ్బందిగా తప్పనిసరి పరిస్థితిలో కొండయ్య దగ్గరకు వచ్చి మౌనంగా అతన్ని ఓ క్షణం చూసి...

'బాగున్నావా బాబాయ్...' అన్నాడు మెల్లిగా గొణుగుతున్నట్లు.

'నా సంగతి సరేరా... నువ్వొక్కడివే వచ్చేవే... మావోడు రాలేదే... పరిచ్చలయిపోయాయా?' అడిగాడు కొండయ్య ఆతృతగా.

'అయిపోయాయి బాబాయ్...' అన్నాడు కోటేశ్వరరావు.

'మరి సుబ్బిగాడు రాలేదేరా? అన్నాడు ఆశ్చర్యంగా.

'బాబాయ్ నీకెలా చెప్పాలో తెలియటం లేదు. కానీ ఇప్పటికీ నిజం చెప్పకపోతే నన్ను దేవుడు కూడా క్షమించడు బాబాయ్..' అన్నాడు కోటేశ్వరరావు భయంగా అతన్నే చూస్తూ.

'ఏందిరా ఏం జరిగిందిరా... తొరగా సెప్పు...' అన్నాడు కొండయ్య ఆశ్చర్యంగా.

'సుబ్బారావుగాడు పరీక్షలు రాయలేదు బాబాయ్... రెండు పరీక్షలు రాశాడు. అంతే... నీ దగ్గర నుంచి తెచ్చిన సొమ్మంతా ఫ్రెండ్స్‌తో తాగుతూ... సినిమాలకు షికార్లకు తగలేశాడు... ఆ పాపంలో నాకు కూడా భాగం ఉంది... నన్ను క్షమించు బాబాయ్' అంటూ కొండయ్య కాళ్ళమీద పడ్డాడు కోటేశ్వరరావు.

కొండయ్య స్థాణువులా అలాగే నిలబడిపోయాడు. అతను కోటేశ్వరరావు చెప్పిన మాటల్ని జీర్ణించుకోలేకపోతున్నాడు. పెద్దోడిభాగం కూడా వీడి చదువులకోసమే అమ్మేసి ఇచ్చేశాడు. ఇప్పుడు పొలమూ పోయింది. వాడి పరీక్షా పోయింది. ఛీ... సర్వనాశనం చేసేశాడు... అని లోలోపల బాధపడుతూ అలానే నిల్చుండిపోయిన కొండయ్యను చూసి.

'నేను వెళ్ళొస్తా బాబాయ్...' అంటూ మెల్లగా జారుకున్నాడు కోటేశ్వరరావు.

కొండయ్య అలానే పక్కనే వున్న మంచంపైన కూలబడిపోయాడు.

* * *

పట్నం నుంచి సుబ్బారావు వచ్చి వారం రోజులయింది. ఈ వారం రోజులూ ఎవరితో మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాడు. తండ్రి చనిపోయాడని కబురు తెలిసిన వెంటనే బయలుదేరి వచ్చేశాడు. సుబ్బారావుకి దుఃఖంతో గొంతు పూడుకుపోయి మాటరావడం లేదు..... ఒక విధంగా తండ్రి చావుకి కారణం తనే అని తనలో తను బాధపడుతూ పశ్చాత్తాపంతో కృంగిపోతున్నాడు. 'ఎంతో ఆశతో ఆయనకిష్టం లేకపోయినా చదువులకోసమని పొలాన్ని నా స్వార్థం కోసం డబ్బులు అవసరమయినప్పుడు ప్రతిసారి ఇంటికి వచ్చి దశలవారీగా తండ్రిచేత అమ్మించాడు. కొడుకు ప్రయోజకుడైతే చాల్లే అనుకుని పాపం ఆ ముసలి తండ్రి ఆఖరి ఎకరం పొలం అమ్మి ఆ డబ్బులు నా చేతికి ఇస్తున్నప్పుడు ఆయన కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి. అప్పుడు ఆయన బాధ నాకు అర్థం కాలేదు. స్వార్థంతో, పొగరుతో నా కళ్ళు పొరలు కమ్ముకున్నాయి. అన్నయ్య మాటమాత్రం కూడా అడ్డు చెప్పలేదు. ఇప్పటికీ నన్ను పల్లెత్తు మాట అనలేదు. పరీక్ష పాసయ్యావా అని మాటమాత్రం కూడా అడగలేదు. పాపం ఆయనకు తెలిస్తే కదా... రిజల్ట్ వచ్చిన సంగతి కూడా అన్నయ్యకు తెలియదు. నా కోసం తన వాటా కూడా అమ్మి వేరే పొలం కౌలుకు తీసుకుని పగలంతా గొడ్డు చాకిరీ చేస్తున్నాడు. వదిన కూడా పగలంతా కష్టపడుతూ తమ కులవృత్తి అయిన కొయ్య బొమ్మల్ని చేస్తూంది.'

సుబ్బారావు అన్నయ్య కష్టం చూస్తున్నాడు.

వదిన కష్టాన్ని... కుటుంబం కోసం ఆమె పడే తాపత్రయాన్ని నిశ్శబ్దంగా గమనిస్తున్నాడు.

'దేవుళ్ళులాంటి నాన్నను, అన్నయ్యను, వదినను నేను మోసం చేశాను. నా పాపానికి నిష్కృతి ఉంటుందా?

ఏం చేసి వీళ్ళ రుణం తీర్చుకోవాలి?

ఏం చేస్తే నా పాపం పరిహారం అవుతుంది?

పొలం అంతా అమ్మేశానే - పెద్దోడికి అన్యాయం చేశానే అనే దిగులుతోనూ నా చదువు పూర్తి కాలేదనే దిగులుతోనూ నాన్న చనిపోయాడు. అయినా అన్నయ్య నన్ను ఇంకా ఆప్యాయంగానే పలకరిస్తున్నాడు... నేను ఇప్పుడు పరీక్ష తప్పానని తెలిస్తే ఆయన మరింత

బాధపడతాడు... నేను పరీక్ష తప్పినట్లు చెప్పకూడదు. అవును అంతే చెప్పకూడదు. అవును అంతే చెప్పకూడదు...' అని మనసులోనే దృఢ నిర్ణయం తీసుకున్నాడు సుబ్బారావు.

పంచలో కూర్చుని బొమ్మలు తయారు చేస్తున్న వదినను తదేక దృష్టితో చూస్తున్నాడు సుబ్బారావు. ఆమె పట్టుదలను... కృషిని చూస్తుంటే తన కర్తవ్యం బోధపడింది. 'ఒక్కమాట కూడా నాతో మాట్లాడకుండా నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుంటూ తన కర్తవ్యాన్ని, బాధ్యతను భుజం తట్టి గుర్తుచేసింది లక్ష్మి వదిన' అనుకుని మనసులోనే కృతజ్ఞతలు తెల్పుకున్నాడు సుబ్బారావు. మెల్లగా ఆమెను సమీపించి అన్నాడు.

'రోజుకు ఈ బొమ్మల ద్వారా ఎంత సంపాదిస్తున్నావు వదినా?' నవ్వుతూ అడిగాడు.

మరిది మాటలకు ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చి...

'ఆ ఏముందిలే బాబూ... నాదీ ఒక సంపాదనేనా? నీలాగా పట్నంలో దర్జాగా ఉద్యోగం చేస్తూ సంపాదించాలంటే నాకు సదువులేదు కదా!... ఏదో మాకు తెలిసిన ఇద్దెతో కట్టపడుతున్నాం' అంది లక్ష్మి నవ్వుతూ.

సుబ్బారావు మనసు చివుక్కుమంది. పాపం నేను పట్నంలో పెద్ద ఉద్యోగం చేయబోతున్నానని తనకు తెలిసిన విద్యను కించపరుచుకుంటూంది అనుకున్నాడు.

'లేదు వదినా... నువ్వు నాకంటే చాలా గొప్ప పనిచేస్తున్నావు... నిజం చెప్పాలంటే నువ్వు నా కళ్ళు తెరిపించావు. ఇన్నాళ్ళు నేను ఎండమావుల్లాంటి కోర్కెల వెంట లక్ష్యం లేకుండా పరుగు తీశాను. నా బాధ్యతను గుర్తుకు తెచ్చావు వదినా... రియల్లీ యువార్ గ్రేట్' అన్నాడు సుబ్బారావు మనస్ఫూర్తిగా.

లక్ష్మి అతన్ని ఆశ్చర్యంగా చూసింది.

'నువ్వేం మాట్టాడుతున్నావో నాకేం అర్థంకాలా... అన్నట్టు పట్నం ఎప్పుడు ఎళ్తున్నావ్?' అంది లక్ష్మి.

'లేదు వదినా... నేను పట్నం పోవటం లేదు. నేను మీ దగ్గరే ఉంటూ మన కులవృత్తి ద్వారా బొమ్మలు చేస్తూ నా చదువును, జ్ఞానాన్ని మీకోసం... మన గ్రామం కోసం వినియోగిస్తాను... దీనివల్ల కూడా ఉపాధి లభిస్తుంది. అనవసరంగా మూడేళ్ళు వృధా చేశాను. పొలాన్ని కూడా అమ్మించాను. నన్ను క్షమించండి. వొదినా... నీతోపాటు మన ఊళ్ళో ఎంతమంది చేస్తున్నారు ఈ బొమ్మలు?' అడిగాడు సుబ్బారావు.

లక్ష్మికి అతని మాటలు అర్థం కావటంలేదు. పట్నానికి పోవటం లేదు అంటున్నాడేంటి అని ఆశ్చర్యంతో అతన్నే చూస్తోంది.

'ఏంటొదినా అలా ఆశ్చర్యపోతూన్నవు? నిజంగానే నేను పట్నం పోను. మన వృత్తి మనం చేసుకుందాం. రేపు మీరంతా మన రచ్చబండ దగ్గరికి రండి. మన ఊళ్ళో నీలాగా బొమ్మలు చేసే వారినందరినీ నువ్వే పిలుచుకురావాలి. అక్కడ చెపుతాను నేను ఏం చేయబోతున్నానో... సరేనా?' అన్నాడు సుబ్బారావు.

లక్ష్మి అతని మాటలకు ఆశ్చర్యపోతూ సరే అన్నట్లు తలూపింది సుబ్బారావు తృప్తిగా నవ్వుకున్నాడు.

*　　　*　　　*

'నేను గత వారం రోజులుగా మన ఊళ్ళో చేతివృత్తుల మీద ఆధారపడి జీవించే వారి ప్రతి వొక్కరి ఇంటికి వెళ్ళి చూశాను. అందరి బ్రతుకులూ అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఎవరికీ పడిన కష్టానికి సరైన ప్రతిఫలం అందటంలేదు.' అన్నాడు సుబ్బారావు. ఆ రోజు సాయంత్రం అందర్నీ రచ్చబండ దగ్గరకు పిలిపించాడు. వదినతో పాటు కొయ్యబొమ్మలు చేసే వారిని... చేనేత కార్మికుల్ని... మట్టిబొమ్మలు... గాజుబొమ్మలు చేసేవారిని అందరినీ రమ్మన్నాడు సుబ్బారావు. వదిన పడే కష్టాన్ని చూసిన తరువాత ఆమె అతనికి పరోక్షంగా స్ఫూర్తినిచ్చింది. వారం రోజులుగా సుబ్బారావు అందరిళ్ళకు వెళ్ళి ఎవరెవరు ఏఏ పనులు చేస్తుంది తెలుసుకున్నాడు. అందరినీ ఒకచోటకు చేర్చడానికి అతనికి వారం రోజులు పట్టింది.

'అవున్రా ఆ యిషయం నీకు ఇప్పుడు కొత్తగా తెలిసిందా ఏంది? పడిన కట్టానికి సరైన సొమ్ములు రావటం లేదనే మా బాధ' అన్నాడు జగన్నాధం. తరతరాల నుంచి చేనేత వృత్తిమీద ఆధారపడి బ్రతుకుతూంది జగన్నాథం కుటుంబం.

'అందుకే నేను చెప్పేది జాగ్రత్తగా వినండి... నా బాధ కూడా అదే' అన్నాడు సుబ్బారావు.

'ఏందిరా ఎన్నికల్లో పోటీ సేత్తున్నావా కొంపతీసి మామీద హటాత్తుగా ఇంత పేమ పుట్టుకొచ్చింది' అన్నాడు ధర్మయ్య.

'లేదు ధర్మయ్య తాతా నాకు ఏ పదవులూ వొద్దు. మన కులవృత్తుల్ని మనం నమ్ముకుందాం... సరైన గిట్టుబాటు ధరని సాధిద్దాం' అన్నాడు సుబ్బారావు.

'అదే వస్తే ఈ కులవృత్తిని వదులుకుని మా పిల్లలు బస్తీకి ఎందుకు ఎళ్తార్రా... వృత్తిని గౌరవించేవాళ్ళూ లేరూ... సరైన ధర లేదు...' అన్నాడు ధర్మయ్య.

'ఇలా సరైన గుర్తింపులేదు... తిండి గింజలకే సరిపోవటం లేదు... అనుకుంటూ అందరూ మన కులవృత్తుల్ని వదిలేస్తూ పోతే ఇక దీనికి వారసులు ఎవరుంటారు తాతా? ఈ కళలన్నీ మీతోనే అంతరించిపోవాలా?' అన్నాడు సుబ్బారావు ఆవేదనగా.

'అంతేమరి... నువ్వేమో పట్నంలో సదువుకుని వచ్చావు. నాలుగు రోజులుండి నువ్వు ఎళ్ళిపోతావు... ఎందుకురా నాయనా మమ్మల్ని ఇట్టా బతకనియ్యి... మా బతుకులింతే' అన్నాడు జగన్నాథం బీడీ వెలిగించుకుని.

'లేదు బాబాయ్ నేను ఎక్కడికీ వెళ్ళను. నువ్వు నేసే చీరె పట్నంతో ఎంతక్కొంటున్నారో నీకు తెలుసా? తెలియదు. పోనీ మా వదిన తయారు చేసే కొయ్యబొమ్మలు పట్నంలో ఎంతక్కొంటున్నారో తెలియదు... ధర్మయ్య తాత తయారు చేసే మట్టిబొమ్మలు ఎంతక్కొంటున్నారో తెలియదు... మీరంతా గొప్ప కళాకారులు. మీలోని గొప్పతనం మీకు తెలియటంలేదు. మనల్ని మధ్య దళారీలు దోచుకుంటున్నారు... అందుకే మనకు సరైన ధర లభించటం లేదు. ఈ దళారీ వ్యవస్థ మారితే మన కులవృత్తులను వదిలి ఎవరూ పట్నాలకు వలస పోరు...' అన్నాడు సుబ్బారావు.

అందరూ అతని మాటలు ఆశ్చర్యంగా వింటున్నారు.

'మన కులవృత్తులకు ప్రభుత్వం నుంచి సరైన గుర్తింపు లభించటంలేదు' అన్నాడు సుబ్బారావు.

'దీనిని నువ్వు కల్పిస్తావా?' అన్నాడు కోటేశ్వరరావు.

'నేనొక్కడినే కాదురా... దీనిలో నీ సహకారం కూడా కావాలి' అన్నాడు సుబ్బారావు.

'తప్పకుండా నేనే కాదు. మన మిత్రబృందం అంతా నీ వెనుకే వుంటుంది.' అన్నాడు కోటేశ్వరరావు. అందరూ చప్పట్లు కొట్టారు.

'ప్రభుత్వం నుంచి సరైన గుర్తింపు లభించాలి... కనీస సౌకర్యాలు లభించాలి. కళాకారునికి సమాజంలో ఒక హోదాను కల్పించాలి. ఈ కళలు అంతరించిపోకుండా ప్రభుత్వమే మనందరి చేత కొత్తవారికి శిక్షణా తరగతులు ఏర్పాటు చేయించాలి. ఉత్పత్తి దారున్నుంచే నేరుగా అమ్మకాలు జరిగేటట్లు చూడాలి. పూర్వం రాజులు కళాకారులకు సరైన గుర్తింపు నిచ్చి సకల సౌకర్యాలను వారికి కల్పించారు కనుకనే మన చరిత్రలో అద్భుతమైన కట్టడాలు వెలిశాయి. ఇప్పటికీ ప్రపంచ దేశాల దృష్టిని మన చారిత్రాత్మక కట్టడాలైన

తాజ్‌మహల్-చార్మినార్, కుతుబ్‌మినార్, ఖజురహో దేవాలయాలు - ఇలా ఎన్నో అద్భుతమైన సుందరమైన కట్టడాలు ఆనాటి మన పూర్వీకులు నిర్మించగలిగారు. అలాంటి ప్రోత్సాహం మన ప్రభుత్వం మనకు కల్పించాలి' అన్నాడు సుబ్బారావు ఆవేశంగా.

'నీ ఆశయం చాలా గొప్పదిరా మా సహకారం మీకు ఉంటుంది' అన్నాడు ధర్మయ్య.

'మీ అందరి సహకారం నాకు కావాలి తాతా రేపే మనం మన ముఖ్యమంత్రిగారిని కలుద్దాం... మన ఈ కళా విప్లవాన్ని మన గ్రామం నుంచే ప్రారంభిద్దాం. అప్పుడు మనకి సరైన గిట్టుబాటు ధర రావటమే కాక మన కళలు బ్రతుకుతాయి... పిల్లలు వారి పిల్లలు... లేకపోతే భావిలో ఈ కళలకు వారసులెవరు? ఏరీ? ఇలా ఈ కళారూపాలకు వారసులవుతారు. మన ఈ కళలకు జీవం పోద్దాం. బ్రతికించుకుందాం' అన్నాడు సుబ్బారావు.

'అవును అలాగే చేద్దాం' అన్నారు అక్కడ చేరిన వాళ్ళందరూ ముక్తకంఠంతో.

సుబ్బారావు ఇప్పుడు తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు. చదివిన చదువు... పట్నవాసం అనుభవం ఇప్పుడు ఇలా ఉపయోగపడుతున్నందుకు అతని మనసు ఆనందంతో నాట్యం చేసింది.

* * *